# సంఘం చేసిన మనుషులు

రచన : "హాయగ్రీవ్"

మధు బయటకొచ్చాడు.

తను ఎన్నో సంవత్సరాలు నివాసమున్న జైలు విడిచాడు.

ఆకాశంవైపు చూశాడు.

పడమటి ఆకాశం రక్తంలా ఎర్రగా మెరుస్తోంది.

రక్తం!

రక్తం!

మధు తన చేతిని చూసుకున్నాడు.

పదేళ్ళక్రితం నెత్తురుతో తడిసిన తన చేతులు ఈనాడు చేవచచ్చి వున్నాయి.

పది సంవత్సరాల క్రితం ఆవేశంతో ఉప్పొంగిన తన గుండెలు ఈనాడు చెప్పబడి, భయంతో ముడుచుకుపోయిన గుండెల్లో గత కాలపు జ్ఞాపకాలు మెదుల్తున్నాయి.

రఘు!

కాత్య!!

సరళ!!!

అవును... సరళ.

తనచెల్లి సరళ.

సరళ ఏమైంది?

ముసురుకుంటున్న ఆలోచనలు అదుపులో పెట్టుకుంటూ ముందుకి నడిచాడు.

సరళను ఒక మంచి వరునికిచ్చి పెళ్ళిచేస్తానని ఒకనాడు తన తల్లికిచ్చిన వాగ్దానం మాటిమాటికి అతని గుండెల్లో సూనపమై గుచ్చుకోసాగింది.

రోడ్డుమీద నడుస్తూ ఆ పదేళ్ళలో చోటుచేసుకున్న విచిత్రమైన మార్పులను ఆశ్చర్యంతో తిలకిస్తూ తన ఇంటి ముందుకొచ్చి ఆగాడు.

ఒకప్పుడు పెంకుటిల్లుగా వుండే తన యిల్లు ఇప్పుడు ఒక అందమైన భవనంగా మారి ఉండటం చూచి, మధు కొన్ని క్షణాలు ఆశ్చర్యంతో శిలాప్రతిమలా చూస్తూ నిలబడిపోయాడు. తన ఊహాకందని ఈ అసాధారణమైన మార్పులను గమనించి, కొన్ని క్షణాల తర్వాత ఆశ్చర్యంనుండి తేరుకొని రెండడుగులు ముందుకు నడిచాడు. ప్రపంచాన్ని అలుముకుంటున్న చీకటిని తన దరికి రానీయకుండా మెరుస్తున్న దీపాన్ని చూశాడు. దీపం వెల్తురులో "సరళా నివాస్" అని వ్రాసి వుండటం చూచి అతనికి మతి పోయినట్లైంది. ఆ మార్పు అతనిలో ఏదో భయాందోళనను కలిగించింది. అతని మనసులో ఏవేవో ఊహలు దొర్లిపోతున్నాయి.

"రండి సార్! మంచి అమ్మాయిలు దిగారు" అన్న ఒక ముసలివ్యక్తి పిలుపుతో అతని ఆలోచనలు పటాపంచలైనాయి.

మధు వాడి పిలుపులో ఆంతర్యం గ్రహించి, వాడి నుండి విషయం గ్రహించే నిమిత్తమై వాడికి ఈ ప్రశ్న వేశాడు.

"నువ్విక్కడకొచ్చి ఎన్నాళ్ళయింది?"

"ఏడేళ్లు" అతని సమాధానం.

"నువ్విక్కడ ఎందుకుంటున్నావు? నీకు ఈ భవనానికి గల సంబంధం ఏమిటి?"

ఈ ప్రశ్నకు వాడు విచిత్రమైన నవ్వొకటి నవ్వి, "చెడిపోయిన వారిని చేరదీసి కొంతమంది వ్యభిచారం చేస్తారు. కన్న కూతుర్ని పడుపుకి పంపి, కడుపు నింపుకుంటున్నాను నేను. ఇది పాపమని తెలిసినా, ఇందుకు ప్రాయశ్చిత్తం లేదని తెలిసినా చచ్చినంతవరకూ బతకాలి కనక బతక్క తప్పదు. అంతే నా సంగతి ఇంతకంటే మీ కనవసరం. మీ సందేహ మేమిటో చెప్పండి" అన్నాడు.

"సరళ గురించి నీకు తెల్సిన వివరాలు చెప్పగలవా?" అన్నాడు మధు.

"ఏ వివరాలు కావాలి? ఇంతకీ తమరెవరు? అతను సంశయించాడు.

"నే నెవరినో నీకు చెప్పినా అర్థంకాదుగాని, సరళను గురించి వివరాలు చెపితే ఈ అయిదు రూపాయలూ నీ

వుతాయి" అంటూ ఒక అయిదురూపాయల నోటు తీసి గాలిలో ఊగించాడు.

చిల్లర డబ్బులకు అలవాటు పడిన చేతులు అయిదు రూపాయల నోటు కనపడగానే ఆశగా, ఆత్రంగా ముందుకి సాగి "చెప్తాను బాబు. అందరికీ తెల్సిన సంగతి మీ ఒక్కరికీ చెప్పడానికి భయమెందుకు? చెప్తాను" అంటూ ఆ నోటు అందుకుని సరళ గురించి వివరంగా చెప్పాడు. అంతా చెప్పిన తర్వాత-

"సరళ ఇప్పుడు సరళ కాదు. "మేడమ్" అంటారు అందరు. "మేడమ్ శోభాదేవి" అంటారు కొందరు. ఇది బాబు ఈ భవంతి కథ అన్నాడు చివరగా.

సరళను చూడాలనే కోరిక మధు నరనరాలలో సముద్రంలా పొంగి సాగింది. ఆమెను చూడాలని ఆమె ఇలా దిగజారిపోవడానికి కారణం కనుక్కోవాలని తహతహలాడుతోంది మనసు. అయితే ఆమె కన్యాయం చేసిన తన ముఖం ఆమెకిలా చూపగలడు. ఏమైనా సరే ఆమె దగ్గర కెళ్ళాలి, తను పశ్చాత్తాపపడాలి. క్షమించమని ప్రాధేయపడాలి. అయితే తను కలుసుకున్నప్పుడు తాను మధుగా ఆమె గుర్తించకూడదు. అతని కోర్కెకు తగినట్లుగానే అతని గడ్డం పెరిగిపోయి పోల్చుకో వీలు లేకుండా వున్నాడు.

"సరళా నివాస్"లో అడుగు పెట్టిన మధుకు ఆ ఇల్లు చూస్తుంటే కళ్లు మెరిసిపోతున్నాయి. ఇంట్లోవున్న ప్రతి వస్తువు సరళ గొప్పతనాన్ని, విలువను చాటి చెప్తుంది. ఇల్లంతా వెస్టరన్ టైపులో అమర్చబడి వుంది. స్ప్రింగు డోరు తెరుచుకుని మధు సరళ గదిలోనికి వెళ్ళాడు. ఆ గది చాల నీటుగా వుంది. సోఫాలు చక్కగా అమర్చబడి వున్నాయి. గది మధ్యలో ఒక పెద్ద టేబుల్ వుంది. దానిపై బ్రాందీ, విస్కీ, రమ్, జిన్, స్కాచ్ సీసాలున్నాయి, అన్నీ పరిశీలిస్తున్నాడు. ఆ గదిలో ఎయిర్ కూలర్ చిన్నగా గురక పెడుతోంది. దానికి శృతి కలుపుతోంది ఫ్రిజిడేర్. గదిలో గోడగడియారం, ఫ్రిజిడేర్,


Use always "RAMRAJ BANIANS"
Buy always "RAMRAJ BANIANS"
Ask always "RAMRAJ BANIANS"

OUR ANDHRAPRADESH AGENTS

- SRI D. RAJAGOPAL—Chittoor
- M/S JANAKI AGENCIES-Hyderabad.
- SRI TIPPANI SANYASI RAO. Rajahamundry.




MFGRS:

RAMRAJ KNITTING FACTROY

THULASI RAO St. : TIRUPUR-638604.

ఎయిర్ కూలర్ల సంగీతానికి తబలా అయింది_ఇంతలో.

"కూర్చోండి" అంది ఒక స్త్రీ గొంతు.

సోఫాలో కూర్చున్నాడు మధు. మధు ముందుకు టీపాయి జరిపి ఆ పెద్ద టేబుల్ పైనున్న సీసాలు కొన్ని దానిపై పెట్టి, ఫ్రిజ్ లోనుండి 'ఈగిల్' బాటిల్ ను తీసి అక్కడుంచింది.

"మీరేం తీసుకుంటారు? విస్కీ, బ్రాందీ..."

"మధు తడుముకుంటూ వి...స్కీ" అన్నాడు.

ఆమె రెండు గ్లాసులు నింపింది... గ్లాసులు ఒకదాన్ని ఒకటి స్పృశించాయి. వెంటనే ఒక్క గుటకలో ఆమె గ్లాసు ఖాళీ అయింది. మధు త్రాగలేదు. ఆమెకు తెలియకుండా అక్కడవున్న సర్వర్ చేత త్రాగించాడు. రెండు మూడు సార్లు గ్లాసులు నిండాయి. ఖాళీ అయినాయి. సరళ కన్నులలో ఎర్రజీర స్పష్టంగా కన్పించింది మధుకు. ఆమె మాటల్లో తొట్రుపాటు, ఇద్దరి మధ్య కొంత నిశ్శబ్దం_తరువాత_

"మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు. నేను మీ కెలా తెలుసు. ప్రత్యేకంగా నన్ను కోరటంలో మీ ఉద్దేశ్యం" ప్రశ్నించింది సరళ.

"మీ పేరు విన్నాను. ఎందుకో ఈ పేరు అంటే నాకు చిన్నప్పటినుండీ చాలా ఇష్టం. ఈ పేరు కల వారిని చాలా గౌరవిస్తుంది నా మనసు" అన్నాడు మధు.

రెండు నిమిషాలపాటు నిశ్శబ్దం అలుముకుంది వారి మధ్య. సరళలోని నిషా ఎక్కువైంది. తల పట్టుకుంది.

మధు సరళనుండి అసలు విషయం రాబట్టడానికి ఇదే మంచి తరుణమని ప్రశ్నలు వేయటం మొదలు పెట్టాడు.

"మీలాంటి వాళ్ళు ఈ నరక కూపంలోనికి ఎలా త్రోయబడుతున్నారు? ఎందుకు త్రోయబడుతున్నారు? విరమించడానికి ఎందుకు ప్రయత్నించరు?" అన్నాడు.

"ఊఁ" అని నిట్టూర్చి "ఇది పిచ్చి ప్రశ్న- ఇది ప్రతివాడు తెలిసి తెలిసి అడిగే అనవసరమైన ప్రశ్న-ప్రతి పురుషుడు సానికొంపలో వున్న స్త్రీలను అడిగే మొట్టమొదటి పనికిమాలిన ప్రశ్న. ఈ ప్రశ్న వేసి గతాన్ని గుర్తుచేసి, పాత చరిత్రలను త్రవ్వి మా మనసులను క్షోభ పెట్టడమే తప్ప, దీన్ని విని సానుభూతిని మనసారా ఎవ్వరు తెలుపలేదు. అయినా నాకు తెలియక అడుగుతాను. మీరు ఇక్కడకొచ్చింది మా నరాల వేడిని, రక్తపు వెచ్చదనాన్ని పంచుకోటానికే తప్ప మా పాత చరిత్రలను త్రవ్వి, హృదయాల్లో మండుతున్న అగ్ని మంటలలో మరో సమిధ వెయ్యడానికి కాదుగదా! ఆ అగ్నిశిఖలుమాలోనే మండనియ్యండి. ఆ మంటల్లో మేం మండి మసైనా ఫర్వాలేదు గాని_మమ్మల్ని పోషించే మీవంటి వారు మాత్రం సుఖంగా చల్లగా ఉండాలి."

మధు మాట్లాడలేదు. ఒకటి రెండు నిముషాలు గడిచాక సరళ "సరే! మిమ్మల్ని చూస్తుంటే ఏదో గౌరవ భావం కలుగుతోంది నాలో. నా బాధ మీకు చెప్పడం వలన నా మనసు చల్లబడదు_బాధ పడదు. కాని నా కథ విన్న తరువాత మీ మనసు బాధపడి బరువెక్కుతాదేమో! అందుకు మీరు సిద్ధంగా వుంటే వినండి మరి" అంటూ ఆమె చెప్పసాగింది.

* * *

నేను, రఘు చిన్నప్పట్నుంచి ప్రాణానికి ప్రాణంగా మసలుతున్నాం. మా ఇద్దరి పరిచయం ప్రేమగా మారింది



నా హృదయం వికసించి క్రొత్త క్రొత్త కోర్కెలు నింపుకొనే రోజుల్లో మా అమ్మ చనిపోయింది. అమ్మ తర్వాత నా యోగక్షేమాలు చూసే అన్నయ్యే నాకు అన్నీ అయ్యాడు. నాకు పెళ్ళిచేసి సంఘంలో ఒక గుర్తింపు గల వ్యక్తిగా తయారుచేసే బాధ్యతను, అమ్మ అన్నయ్యకు విడిచి వెళ్ళిపోయింది. నేనంటే అన్నయ్య కెంతో ఇష్టం. అటువంటి అన్నయ్యకు మా ప్రేమ విషయము చెప్పాలనిపించింది. కాని అన్నయ్య ముందు మా ప్రేమ ప్రసక్తితెచ్చే ధైర్యం లేక కొన్నాళ్లు చెప్పలేక పోయాను. అమ్మ వుంటే అమ్మతో ఆ మాటలు చెప్పే దాన్ని. కాని అన్నయ్య అయిన మధుతో చెప్పటానికి నా మనసుకు ధైర్యం చాలలేదు.

అన్నయ్య ఎప్పుడూ ఆఫీసు పనితో సతమత మయ్యే వాడు. అమ్మ లేకపోవడం, అన్నయ్యకు నా గురించి ఆలోచించే తీరిక లేక, నా గురించి పట్టించుకోకపోవడం ఈ పరిస్థితులు కల్పించిన అవకాశంలో మా ప్రేమ మరింత ఎదిగింది.

రోజులన్నీ ఒకే విధంగా వుండవు. మా ప్రేమ ఏదో తెలియని ప్రతిఫలాన్ని కోరడంచేత మాలోని కోరికలు మమ్మల్ని జయించడంచేత మా ప్రేమ మరోదోవ పట్టింది ఫలితంగా తప్పు చేసాను.

నేను తప్పు చేసానని కాదు. నాకు రఘుపై అంతటి నమ్మకం వుంది. అతని చిలిపి కన్నుల్లో చిందులాడే అనంతమైన విశ్వాసం, మమ్మల్ని పూలడోలల్లో వూపు తుందనే అనుకున్నాను. కాని అనుకోని విధంగా మే మిద్దరం అన్నయ్యకు ఓరోజు కనపడిపోయాం. ప్రణయావేశంలో ఉన్న మా ఇద్దర్ని చూసి ప్రళయకాల రుద్రుడిలా వూగిపోయాడు. అన్నయ్యలో ఎప్పుడూ చూడనంత ఉద్రేకం కన్పించింది. అగ్నిగోళాల్లా మెరుస్తున్న కళ్ళతో కోపంతో వణుకుతున్న చేతులతో, నా ఒడిలో సుఖాన్ని పొందుతున్న రఘుని ఎంతో ఘోరంగా కొట్టాడు. రఘు మొదట కొట్టలేదు. కోపంతో ఊగి పోతున్న అన్నయ్యను చూసి రఘు భయపడినా, తాను నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు. "కులం తక్కువ గాడిదా! నీకు నా చెల్లెల్ని ముట్టుకునే హక్కులేదు. నీ అర్హతల్ని మరచిపోయి, పెద్దింటి ఆడపిల్లని పాడు చేసినందుకు ఈవాళ నా చేతుల్లో నీ చావు తప్పదు." అంటూ ఫీంకరించి దెబ్బల వర్షం కురిపించాడు కాసేపటి వరకు రఘు, అన్నయ్యకు నచ్చజెప్ప చూసాడు. కాని ఫలితం లేకపోయింది. ఇంక అన్నయ్యని నిరోధించ డానికి పూనుకున్నాడు. అయితే అప్పటికే రఘు ఎన్నో దెబ్బలు తిన్నాడు, చేతులనించి, మొఖంనుంచి రక్తం కారుతోంది.

ఆవేశంలో వున్న అన్నయ్య వెనకా ముందు చూసు కోకుండా, అక్కడున్న పెద్ద బండరాతిని ఎత్తి రఘు నెత్తిమీద టపా టపా అబ్బ... ఆ నెత్తురు, ఆ అరుపులు, ఆ ఆర్తనాదం, అబ్బ మైగాడ్, తలచుకుంటే నాకు బ్లెడ్ ప్రెజరొస్తుంది. జివ్వుమని చిమ్మిన రక్తం చూసి నాకు పిచ్చి వచ్చేస్తుందేమో ననుకున్నాను. కాని రాలేదు. కొన్ని క్షణాల తర్వాత నెత్తుట్లో రఘు తేలు తున్నాడు.

ఎల్లప్పుడూ "ట్రిప్లెక్స్" బనియన్లనే కోరండి!!

మా తయారింపులు:—

♦ జోవ్ ♦ కింగ్‌షా ♦ దోరహా

(అన్నియు ఇజిప్షియన్ రకాలు)

X X X ఇంటర్‌లాక్

X న్యూమరాక్ మరియు చెడ్డీలు.

:తయారించువారు:

PHONE : 21974

TRIPLEX KNITTING MILLS

TIRUPUR - 638604.

అన్నయ్య కళ్ళల్లోని రక్తపు జీర కరిగిపోయింది. ఆ ఎరుపుని మించిన ఎరుపు, రక్తంతో తడిసిన చేతులు... అబ్బ ఆ దారుణమైన దెబ్బలు, ఆ ఘోరమైన చావు... గుర్తుకొస్తే...ఆగింది సరళ, ఆగి మరో రెండు పెగ్గులు బ్రాందీలో సోడా కలుపుకోకుండానే తాగేసి, "ఆ సంఘటన గుర్తుకొస్తేచాలు నాకు నిద్ర పట్టదు. ఫలితంగా అన్నయ్య చేతిలో రఘు చచ్చిపోయాడు. అది నా బ్రతుకులో క్రొత్తమలుపును త్రిప్పినరోజు. అన్నయ్య కూడా అంతపని చేయాలని చేయలేదు, ఆ వేశంలో తన్ను తాను మరచిపోయాడు. ఆ తర్వాత ఇంకేముంది?... రఘు పరలోకానికి వెళ్ళిపోయాడు. అన్నయ్య జైలుకి వెళ్ళాడు. నేను ఏకాకినయ్యాను. రఘు నన్ను విడిచిపోయినా, అతను నాలో విడిచిపోయిన అతని ప్రతిరూపం మాత్రం నాలో దినదినానికి పెరగసాగింది. లోకానికి జడిసి రఘువాళ్ళింటికెళ్ళి నా బాధ చెప్పుకున్నాను. వాళ్ళకి నాపై జాలి బదులు అసూయ, కోపం ఎక్కువైనాయి. కన్నెపిల్ల మాతృస్థానం అలంకరించడం, ఏనాడు సంఘం హర్షించలేదు. గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. కాని అది నాకుసాధ్యం కాలేదు. రఘు ప్రతిరూపం నాలో పెరిగి ఒకరోజున నా పేగుల్ని తెంచుకుని బయటపడింది. మగబిడ్డపుట్టాడు. ఈ విషయం లోకానికివ్యక్తమయింది, లోకానికి నేనొక ఖూనీకోరు చెల్లెలిగా, కులటగా కనుపించాను. ఏ దిక్కూ లేని నన్ను ప్రతి దిక్కుమాలిన వాడూ చూచి పళ్ళికిలించాడు. రఘు ప్రతిరూపాన్ని అనాధాశ్రమంలో విడిచాను. నా దగ్గరున్న డబ్బూ, నగలు అన్నీ అయిపోయినై. ఇల్లు అద్దెకిద్దామని 'టు లెట్' బోర్డు తగిలించాను.

నా అదృష్టమా అన్నట్లు ఒక పెద్దమనిషి వచ్చాడు. నాకో గది వుంచుకుని మిగిలినది వందరూపాయలకు అద్దెకిచ్చాను. అతను వెంటనే వందరూపాయలు అద్దె యిచ్చి వెళ్ళిపోయాడు.

మరుసటిరోజు వాళ్ళొచ్చి యింట్లో దిగారు. రాత్రి పది అయ్యేసరికి యింటిముందు రిక్షాలు ఆగటం, అందులోనుండి కొంతమంది దిగటం, ఆ పెద్దమనిషి వాళ్ళనాహ్వానించి ఇంటిలోపలకు తీసుకుని వెళ్ళటం, కొంతసేపటికి వారు తిరిగి రిక్షాలో వెళ్ళిపోవటం-ఇది ప్రతి రోజూ జరుగుతూనే వుంది.

నెలరోజులైన తర్వాత ఆ పెద్దమనిషి నా గదికొచ్చి అద్దె డబ్బులిచ్చాడు. కాఫీ ఇచ్చాను. అతను కాఫీ త్రాగి నా ప్రక్కగా వచ్చి నా తల నిమురుతూ "నీకెవరూ లేరా?" అన్నాడు. నేను నాకథంతా వివరించిచెప్పాను. నా ఒంటరితనాన్ని అసహాయితను అవకాశంగా తీసుకుని నన్ను బలవంత పెట్టాడు. నేను అతనినుండి తప్పించుకోవాలని పెనుగులాడాను. గట్టిగా అరిచాను. గిల్లాను... రక్కాను...కరిచాను. నన్ను నేను కాపాడుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేసాను. కాని ఈ దీనురాలిఘోష ఎవరి చెవులను తాకలేదు. అనాదిగా వస్తున్న స్త్రీ బలహీనత పురుషుని బలానికి తలవంచక తప్పలేదు. ఫలితంగా నా మానాన్ని నేను కాపాడుకోలేకపోయాను. అతను వెళ్ళిపోబోయే ముందు వందరూపాయల నోటు నా ముఖంమీద కొట్టి వెళ్ళిపోయాడు. అది మొదలు అతను నా గదికి తరుచూ వస్తూ వెళ్తుండేవాడు. నా అసహాయితను అతను ఖరీదు కట్టాడు. ఖరీదు కట్టిన నా శరీరాన్ని పదిమందికి పణంగా పెట్టాడు. అది నా బ్రతుకులో భయంకరమైన మార్పు.

కొన్నాళ్ళకొక ముసలాయన నన్ను తన యింటికి తీసుకెళ్ళాడు. తనకు ఆడదిక్కు ఎవరూ లేరని నన్ను పెళ్ళి చేసుకున్నాడు. తన ఆస్తినంతా తన తదనంతరం నా పేర వ్రాశాడు. నన్ను ఈ నీచ వృత్తినుండి దూరం చేశాడు. ఈ చిన్న పెంకుటిల్లుని భవంతిగా మార్చాడు. కాని అతను ఎక్కువకాలం బ్రతకలేదు. బహుశః మంచివారు అట్టేకాలం బ్రతకరేమో! నరకం నుంచి స్వర్గంలోకి అడుగుపెట్టానన్న తృప్తి నా హృదయాంతరాల నిండా నిండకముందే, అంటే ఆర్నెల్లయినా నిండకముందే ఆయన పరలోకం వెళ్ళిపోయారు. చేతినిండా డబ్బూ, యింటినిండా ఒంటరితనం....నాకు ఆనందంకంటే ఆవేదనే కలిగించాయి. ఇంతలో మునుపటి నరకంలోని నా స్నేహితురాళ్లు నన్ను ఆశ్రయించారు. పాపపుణ్యాలను, మంచిచెడ్డలను బేరీజు చేసుకోకుండా, నన్ను నమ్మిన స్నేహితురాళ్ళ జీవనయానమే, నా ముఖ్య కర్తవ్యమై, ఈ యింటిలోనే భారీయెత్తున కంపెనీ నడిపించాను. ఆడది ఒకసారి పాడైనా, వందసార్లు పాడైనా సమాజం దృష్టిలో ఒక్కటే. ఏదో ఒకనాడు మట్టిలో కలిసిపోయే ఈ తనువు పదిమందికి ఆనందాన్నిస్తూ మరో పదిమంది నిర్భాగ్యులకు అన్నం పెడుతుంటే, అంతకంటే కావలసిందేముంది? అందుకే ఈ త్రోవ మంచిది కాదని తెలిసినా, అందులోనే పయనించక తప్పలేదు.

ఇప్పుడు దీని హోదా పెరిగింది. సాధారణమైనవారికి అందుబాటు తప్పింది.- రిక్షాలు స్థానే కార్లు. టాక్సీలు,

సాధారణమైన వారిస్థానే ఆఫీసర్లు, ఖద్దరుబాబులు, కంట్రాక్టర్లు, ఇంజనీర్లు ... జేబుల్లో డబ్బు, గుండెల్లో కోరికవున్న రసికులు వచ్చారు. వస్తున్నారు. ఇప్పుడు మీరొచ్చారు.

స్త్రీకి కావల్సినది ముఖ్యంగా తోడు. చిన్నప్పుడు తల్లిదండ్రులు—తర్వాత భర్త, ఆ తర్వాత సంతానం. లత అల్లుకు పోవాలంటే పందిర ఎంత అవసరమో స్త్రీ జీవితం పండాలన్నా, సంఘంలో మగనాలిగా జీవించాలన్నా పురుషుని తోడు అవసరం. ఒంటరితనం స్త్రీకి ఇన్ని అనర్థాలకు కారణమౌతుంది.

నా జీవితం ఎలానూ పతనమైపోయింది. కర్ణుడిచావుకు అనేక కారణాలున్నట్లు, ఆడదాని పతనానికి అనేక కారణాలుంటాయి. నన్నీ స్థితికి తీసుకొచ్చినందుకు ఒకర్ని నిందించను. దేవుణ్ణికూడా! నా బ్రతుకుమీద తీపే నన్నింకా బ్రతకమంటోంది. అందుకే బ్రతుకుతున్నాను.

ఆమె కళ్ళనుండి ధారాపాతంగా కన్నీరుబికింది.

నీరు నిండిన కళ్ళతో, జీరపోయిన కంఠంతో పట్టలేని ఆవేశంతో మధు "నేను చేసిన నేరానికి శిక్ష విధించిన చట్టంకానీ, నేను చేసిన పాపమే నీపాలిటి శాపమే, నీ బ్రతుకును ఎంగిలి విస్తరిగాచేసి, నీ బ్రతుకు విలువనే మార్చేసింది. దీనంతటికీ కారణం నేనే .. నేనే .. నేనే" అంటూ విలవిలపోయాడు మధు.

ఆ మాటకు సరళ నిశ్చేష్టురాలైంది. తల విదిల్చింది. కళ్ళు పెద్దవి చేసింది. మధువైపు పరీక్షగా పరిశీలనగా చూసింది. పది సంవత్సరాల గతంలోకి చూపుల్ని గుచ్చి చూచింది. రెల్లు పొదలా దట్టంగా ఉన్న గడ్డంలో, పశ్చాత్తాపంతో ఎర్రబడిన ముఖాన్ని రెప్పార్పకుండా చూసింది.

అన్నయ్యా,
అన్నయ్యా!!

ఆమె పెదవులు నిశ్శబ్దంగా గొణిగాయి. కాని ఆమె కళ్ళు మెరవలేదు.

"క్షమించమ్మా! హత్య చేసినందుకు చట్టం విధించిన శిక్ష ఈ నాటితో పూర్తయింది. కాని, నీ జీవితం ఇలా ముక్కలు చేసినందుకు పశ్చాత్తాపం ఇప్పుడే ప్రారంభమయింది. నేరానికి శిక్షలున్నాయి. కాని పాపాలకు శిక్షలేవు. పశ్చాత్తాపం తప్ప...నన్ను క్షమించమ్మా. జరిగిన ఘోరానికి ఒక్కసారికాదు. వెయ్యిసార్లురి లక్ష సార్లు క్షమార్పణ కోరినా పాపం మాసిపోదు. కాని శారీరకంగా, మానసికంగా, పశ్చాత్తాపంతో కృంగిపోయిన నేను ఇంతకంటే ఏం చెప్పగలను.

మధు ఆగాడు.

ఆమె నిశ్చలంగా కళ్ళు మూసుకుంది.

అయిదు, పదినిముషాలు గడిచాయి.

కన్నీళ్ళు పల్చబడ్డాయి.

"జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. బోలెడంత జీవితం ఇంకా నీ కోసం ఎదురుచూస్తోంది. నీవీ జీవితాన్ని విడిచిపెట్టి ఇకనైనా పెళ్ళి చేసుకో..." మధు ఆమెను కోరాడు.

మధు మాటలు విని సరళ శుష్కమైన మందహాసం చేసింది.

"పెళ్ళి! ఎవరికన్నయ్యా పెళ్ళి! శవాలకు పెళ్ళిచేసే సాంప్రదాయం మన కులాల్లో లేదే! సమాధులు తవ్వి శవాలకు ప్రాణాలు పోసే శక్తి ఇంకా మనిషికి రాలేదు. మేం మనుషులుగా ఏనాడో చచ్చిపోయాం ఇప్పుడు జీవస్మృతులం. ఆడది ఏనాడూ స్వతంత్ర జీవికాదు. చిన్నతనంలో తల్లితండ్రులు, వయసులో భర్త, వృద్ధాప్యంలో బిడ్డలు, స్త్రీని ఆదరించాలి. తల్లీ, తండ్రిని దేవుడు తీసుకుపోతే, వయసులో వరించిన భర్తను నువ్వు దూరం చేశావు...ప్చ్ అదంతా ఇప్పుడెందుకులే. నీలో నిజంగా పశ్చాత్తాపంకలిగితే అది చాలా లేటైపోయిందన్నమాట. ఇప్పుడు కావలసింది పశ్చాత్తాపంకాదు. పనిజరిగేమార్గం. నువ్వు నన్ను మార్చాలని ప్రయత్నించకు. విరిగిపోయిన పాలను, చెడిపోయిన ఆడదాన్ని ఎవరూ బాగుచెయ్యలేరు. నువ్వు బాగుపర్చాలని ప్రయత్నించినా నాకు బాగుపడే అవకాశంకాని, ఆ అవసరంగాని లేదు. దేవుడు మెచ్చేవిధంగా నేను ఏలానూ బ్రతకలేదు. కనీసం సంఘానికి పనికొచ్చే విధంగానైనా బ్రతకాలికదా! ఇప్పుడు నేను సంఘం చేసిన మనిషిని. ఇప్పుడిప్పుడే లోకంవైపు చూస్తున్న నా కొడుకు, అనాధాశ్రమంలో అనాథల్లో అనాథగా బ్రతుకుతున్నాడు. వాడ్ని పోషించలేక కాదు. ఈ లోకాన్ని వాడికి చూపించలేకే అక్కడవదిలేశాను. వాడ్ని నీతో వుంచుకుని బాగుపర్చు. డబ్బు విషయం ఆలోచించకు డబ్బు నేనిస్తాను. మార్గం నువ్వు చూపించు వాడికి తల్లంటూ ఒకరున్నారని చెప్పొద్దు. ఏ తల్లినీ ఏ తనయుడు వ్యభిచారిగా ఊహించలేడు. ఊహించి బ్రతకలేడు. బ్రతికినా ఈ సమాజం వాడిని బ్రతకనివ్వదు. అందుచేత వాడ్ని నీ చేతుల్లోనే పెరగనీయ్ ... ఏం? ఏమంటావ్?"

"నువ్వు చెప్పినట్లు మనం సంఘం చేసిన మనుషులమే కాదు. విధిచేతిలో కీలుబొమ్మలం కూడా. దైవ నిర్ణయం ఎలావుంటే అలా నడవక తప్పదు" అన్నాడు మధు నిట్టూరుస్తూ.